www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 24 జనవరి 2024
5
చిత్తూరు



'కాంప్లాన్'కు అంబాసిడర్‌గా 'స్నేహ'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జడస్ వెల్నెస్ లిమిటెడ్‌కు చెందిన ప్రముఖ హెల్త్ ఫుడ్ డ్రింక్ అయిన కాంప్లాన్ కు సుప్రసిద్ధ దక్షిణ భారత నటి స్నేహతో తమ నూతన ప్రచారం 'ఐయామ్ కంప్లాన్ బాయ్/గర్ల్'ను ప్రారంభించింది. కొత్త కమ్యూనికేషన్‌లో స్నేహ ఎదుగుతున్న పిల్లల కోసం ప్రోటీన్ ఆవశ్యకతను వెల్లడించనున్నారు. ఇతర ప్రముఖ పిల్లల ఆరోగ్య ఆహార పానీయాల కంటే 63శాతం ఎక్కువ ప్రోటీన్‌ను కలిగి ఉన్న కాంప్లాన్‌ను ఉత్తమ పరిష్కారంగా సిఫార్సు చేశారు. 34 ముఖ్యమైన పోషకాలతో పాటు పిల్లల ఆరోగ్య ఆహార పానీయాల కంటే మిన్నగా 63శాతం ఎక్కువ ప్రోటీన్ ఇందులో ఉందని ఆమె తెలిపారు. జెడ్ఎస్ వెల్నెస్ సీఈఓ తరుణ్ అరోరా మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య ఆహార పానీయాల విభాగంలో కాంప్లాన్ ఒక ఐకానిక్ బ్రాండ్. ఇది 100 శాతం మిల్క్ ప్రోటీన్‌ను కలిగి ఉంది. పిల్లల పూర్తి ఎదుగుదలకు సరైన పరిమాణంలో మంచి నాణ్యమైన ప్రొటీన్‌ను అందించాల్సిన అవసరాన్ని, తాము కొన్ని సంవత్సరాలుగా తల్లులకు తెలియజేస్తున్నామన్నారు. దీనిని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ.4732కోట్లు

- ఆమోదం తెలిపిన సభ్యులు
- ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని వివరించిన జెడ్పీ ఛైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న జెసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4,732 కోట్ల ప్రతిపాదిత జెడ్పి వార్షిక బడ్జెట్‌కు జెడ్పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదం తెలుపడం జరిగిందని జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పి ఛైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ఎంపీ రెడ్డప్ప, జెసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. జెడ్పి నిధుల కేటాయింపులో పూర్తి పారదర్శకంగా ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు చేపట్టి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు చేరవేయడంలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నదని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జెడ్పి సీఈఓ ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాల మేరకు మంత్రి సలహాలు, సూచనలతో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి శాఖల ప్రగతిలో భాగంగా వివిధ శాఖల ప్రగతిపై ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా అధికారులు సమావేశంలో వివరించారు. ఇందులో భాగంగా సత్యవేడు సిహెచ్‌సిలో అనస్తీషియా డాక్టర్‌ను నియమించాలని, ఆప్తమాలజీకి సంబంధించిన పరికరాలను అందించాలని, రామచంద్రాపురం మండలంలో 90రోజులలో ఇంటిపట్టాల మంజూరులో జాప్యం జరుగుతున్నదని, బంగారుపాళెంలో తుంబకుప్పంలో హౌసింగ్ క్రింద ఇంటిపట్టాలు మంజూరు చేయాలని, బి.కొత్తకోట మండలం గట్టు నందు ఇండ్లపట్టాలు మంజూరు చేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకుని రాగా చిత్తూరు జిల్లాకు సంబంధించి జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ బంగారుపాళెం తుంబకుప్పం గ్రామంలో హౌసింగ్ క్రింద ఇంటిపట్టాలు మంజూరుకు కోర్టులో కేసు వుందని వివరిస్తూ, తిరుపతి, అన్నమయ్య జిల్లాకు చెందిన రెవెన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ సమావేశం మినిట్స్‌ను సంబంధిత జిల్లాల రెవెన్యూ అధికారులకు పంపవలసినదిగా సిఈఓను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి రోజాపై జడ్పీటీసీలు అసమ్మతి స్వరం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మంత్రి రోజాపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో నగిరి నియోజకవర్గ జడ్పిటిసి అసమ్మతి స్వరం వినిపించారు. మాపై కక్ష సాధింపుతో మంత్రి రోజా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు కాకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు జడ్పిటిసిల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీ చైర్మన్ సమక్షంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పిటిసిలకు చిన్నపాటి రూములు కూడా కేటాయించడం లేదని వడమాలపైట జడ్పిటిసి మురళీధర్ రెడ్డి ఆరోపించారు. తనపై కక్ష సాధింపుతో మంత్రి రోజా వ్యవహరిస్తున్నారు. జెడ్పి సర్వసభ్య సమావేశం అనంతరం వడమాలపేట జడ్పిటిసి సభ్యులు మురళీధర్ రెడ్డి, నింద్ర మండలం జడ్పిటిసి మల్లీశ్వరి విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీది అరాచక ప్రభుత్వం : మాజీ మంత్రి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-వికోట: అధికారంలోకి వచ్చింది మొదలు వైసీపీ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికోటలో నిర్వహించిన 'జయహో బీసీ' కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారై ప్రసంగించారు. వైసీపీని ప్రజలు తరిమి కొట్టేందుకు రోజులు దగ్గర పడ్డాయని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్ తన ఓటమిని ముందే ఊహించి అభ్యర్థులను బదిలీ చేసి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారంటూ ఆరోపించారు. బీసీ వర్గాలకు టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని విధాల ఆదుకుంటామని, బీసీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ కూడా టీడీపీనే అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అంతకు ముందు వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయుడు, రంగనాథ్, నాగభూషణం, రాంబాబు, ఈశ్వర్‌గౌడ్, చౌడప్ప, సోమశేఖర్, గోపినాథ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై వైసీపీది కపట ప్రేమ: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామకుప్పం: వైసిపి ప్రభుత్వం బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వయకర్త పిఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు ధ్వజమెత్తారు. మంగళవారం మండల కేంద్రం బజార్ వీధిలో జయహో బిసి సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టిడిపి పాలనలో బీసీలకు అత్యున్నత స్థానం కల్పించి నామినేటెడ్ పలువులు అందించి, ప్రభుత్వం ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి ఆర్థిక అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నాలుగున్నర సంవత్సరంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని భూ భూకబ్జాలు ఎక్కువైందన్నారు. బిసిలపై వైసిపి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని దుయ్య బట్టారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, ఆదరణ పథకం కళ్యాణమస్తు కార్యక్రమాలను రద్దు చేయడమే కాకుండా బీసీల రాజకీయ రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతం కుదించి 16వేల ఎనిమిది వందలు మంది బీసీలను పదవులకు దూరం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి, చలపతి, చిన్న కృష్ణ, నందా రెడ్డి, సుబ్రి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కళలను విశ్వవ్యాప్తం చేయాలి

త్వరలో కళాశాలలో వజ్రోత్సవాలు : జేఈవో

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: భారతీయ పురాతన సంస్కృతి, సాంప్రదాయాలైన సంగీత, నృత్య కళలను విశ్వవ్యాప్తం చేసి, భవిష్యత్తుతరాలకు అందించాలని టీటీడీ జేఈవో సదాభార్గవి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఎస్వీ సంగీత నృత్య కళాశాలను మంగళవారం జేఈవో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జేఈవో మాట్లాడుతూ, శ్రీవారి అనుగ్రహంతో టీటీడీ తరతరాలుగా మన పూర్వీకులు అందించిన ప్రాచీన కళలకు ప్రాణం పోస్తున్న గొప్పసంస్థ అన్నారు. సంగీతం, నృత్యం అతి కష్టమైన, మనస్సుకు దగ్గరగా ఉన్న విద్య అని చెప్పారు. ఎంతో చరిత్ర ఉన్న సంగీత నృత్య కళాశాల, విశ్వవిద్యాలయం స్థాయికి చేరుకోవడానికి అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ స్కాలర్‌షిప్ రూపంలో లక్ష రూపాయలు అందిస్తోందని చెప్పారు. శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వెనుక ఉన్న పాత టీటీడీ పరిపాలన భవనంలో సంగీత, నృత్య మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. కళాశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం రూ.11కోట్లతో నూతన హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కళాశాలలో వజ్రోత్సవాలు వారం రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు తమ సంగీత, నృత్య, వాద్య సంగీతంలో శ్రీవారి కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. సీఈవో శేష శైలేంద్ర మాట్లాడుతూ, మన వేదాలలో ఉన్న పురాతన కళలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భారతదేశం భరతనాట్యం, కూచిపూడి తదితర నాట్యాలు సంగీత వాద్య కళల సమూహమన్నారు. భారతీయ జీవన విధానం మన సంస్కృతిపై ఆధారపడి ఉంటుందని, మన సంస్కృతి సాంప్రదాయాలను నిలబెట్టిన సనాతన మహర్షులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కళాశాల స్థాయిలోనే అష్టాదశ ప్రాజెక్ట్ రావడం గొప్ప విషమన్నారు. మన వేదాల్లోని సంస్కృతిని కళాకారులు ఏవిధంగా ప్రదర్శించాలి, తదితర అంశాలను వివరించారు. అనంతరం ఎస్వీ డోలు, నాదస్వరం పాఠశాలలో 6 సంవత్సరాల డిప్లమో కోర్సు పూర్తి చేసిన 19మంది విద్యార్థులకు లక్ష రూపాయలు గౌరవ పారితోషికాన్ని జేఈవో విద్యార్థులకు అందించారు. తరువాత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకుముందు జేఈవో, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఈవో భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం: ఎంపీ రెడ్డెప్ప
- 4వ విడతలో జిల్లాకు సంబంధించి రూ.324కోట్ల లబ్ధి: కలెక్టర్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:
మహిళల ఆర్థికాభివృద్ధి కోసం 'వైఎస్ఆర్ ఆసరా' పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల ప్రకారం స్వయం సహాయక సంఘాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం 4వ విడత 'వైఎస్సార్ ఆసరా' నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి లాంఛనంగా ప్రారంభించారు. మహిళల ఖాతాలకు నగదును జమ చేశారు. జిల్లా సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, జెడ్పి వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి, మేయర్ అముద, లీడ్ బ్యాంకు మేనేజరు హరీష్, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కలెక్టర్ జిల్లాకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ 33,655 గ్రూపులకు చెందిన 3,10,643మంది మహిళలకు రూ.324కోట్లు జమౌతుందన్నారు.రి

ఇళ్ల పట్టాదారులకు రిజిస్ట్రేషన్: జేసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:
నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో పట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను జనవరి 27 నుంచి ఫిబ్రవరి 9 లోపల పూర్తి చేయాలని జేసి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన అర్‌డిఒలు, తహశీల్దారులుతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ రైట్స్‌కు సంబంధించి పెండింగ్ ఎక్కడైనా వుంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను విఆర్ఒ లాగ్ఇన్ ద్వారా చేయించాలన్నారు. ఆన్‌లైన్‌లో వున్న డేటా ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి 24న సబ్ రిజిస్ట్రార్‌ల నుంచి పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలకు, 25న డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇప్పించాలన్నారు. అధికారులకు సూచనలిచ్చారు. ఛాంబర్లో సూపరిండెంట్ మురళి పాల్గొన్నారు.

రేపు గ్రూప్ 2పై అవగాహన సదస్సు

ఉచిత స్టడీ మెటీరియల్స్ పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:
నిరుద్యోగ యువతీ యువకులకు గ్రూప్ 2 డీవైఈవో అవగాహన సదస్సును డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీన స్థానిక యశోదానగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పోటీపరీక్షల నిపుణులు గుంటూరు, కృష్ణా జిల్లాల శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే వివిధ సబ్జెక్టు నిపుణులు కూడా హాజరవుతారని, నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొని వారికున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. సదస్సు అనంతరం ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందని ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాకర్స్ ఆధ్వర్యంలో

సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ :
లయన్స్ క్లబ్ అధ్యక్షులు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కష్ణప్రసాద్ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను తిరుపతి కరకంబాడి రోడ్డు నందలి వినాయకసాగర్‌లో వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ భారతదేశ చరిత్రపుటల్లో కీర్తికిరీటల్లా నిలిచిపోయిన నేతల్లో ప్రముఖుడు. దాస్య శంఖలాల్లో మగ్గుతున్న భారతీయులకు అభయహస్తం అందించి, నూతనోత్సాహాన్ని నింపిన మహనీయుడని పేర్కొన్నారు. దేశంకోసం తన ప్రాణత్యాగం చేసిన మహనీయుడని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువతరం వారి బాటలో నడవాలని సూచించారు. తరువాత సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్కాట్ కష్ణప్రసాద్, జగన్నాధం, బెల్లంకొండ సురేష్, బాసికార్ల రఘు, బాలాజీ నాయుడు, యోగ వెంకటేష్, కమలమ్మ, రామారావు పాల్గొన్నారు.

నేడు తిరుపతికి సిఎం రాక

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 24న బుధవారం తిరుపతి పర్యటన సందర్భంగా చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జాయింట్‌కలెక్టర్ శుభంభవల్స్‌లతో కలసి మంగళవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో ఈనెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి పర్యటనకు సంబంధించి ఏఎస్ఎల్‌లో (ముందస్తు భద్రత లైజన్)పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 24న బుధవారం తిరుపతి తాజ్ హోటల్‌లో నిర్వహించే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అందులో భాగంగా ఎలాంటి చిన్నపాటి లోపలకు తావివ్వరాదన్నారు. బుధవారం సాయంత్రం 4.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్డుమార్గాన 4.30 గంటలకు తాజ్ హోటల్ చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం హోటల్ నుంచి బయలుదేరి 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారని, భద్రతా ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని సూచించారు. వైద్యశాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులన్స్, సేఫ్ రూమ్, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎస్పి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ బందోబస్తు పటిష్టంగా ఉండాలని విధులు కేటాయించిన పోలీస్ అధికారులకు భద్రతపై తగిన సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, ఏర్పోర్ట్ సిఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, ఎఎస్పీ విమల కుమారి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల రాజారఘువీర్, పౌర సరఫరాలశాఖ మేనేజర్ సుమతి, జిల్లా ఫైర్ ఆఫీసర్ రమణయ్య, ఇన్స్పెక్టర్ రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు.

సిఎం స్పందించి న్యాయం చేయాలి: భువనేశ్వరి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ భువనేశ్వరి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):
పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తానని ఆశ చూపి మంత్రి రోజా తన వద్ద నుంచి రూ.40లక్షలు దశలవారీగా తీసుకున్నారని, ఇప్పుడు పదవి ఇవ్వకపోగా ఇచ్చిన సొమ్ము తిరిగి చెల్లించలేదని పుత్తూరు మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల క్రితం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలలో దళిత రిజర్వేషన్ వార్డు కావడంతో వార్డు ప్రజలు తనను ఏకగ్రీవంగా కౌన్సిలర్‌గా ఎన్నిక చేశారన్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఛైర్మన్‌గా పదవి కోసం మంత్రి రోజాను సంప్రదించగా రూ.70లక్షల అవుతుందని చెప్పారని, తాము అంత ఇవ్వలేమని చెప్పగానే ఆమె తన సోదరుడు కుమారస్వామి దగ్గరకు వెళ్లి మాట్లాడాలని చెప్పారన్నారు. కుమారస్వామి దగ్గరకు వెళ్ళగా ఆయన తన అనుచరుడైన సత్యను తన ఇంటి వద్దకు పంపించడంతో మొదటగా రూ.20లక్షలు చెల్లించామన్నారు. తర్వాత రూ.7, 3, 10 లక్షలు చొప్పున దశలవారీగా మొత్తం రూ.40 లక్షలను ముట్ట చెప్పామన్నారు. కానీ పుత్తూరు మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో కౌన్సిలర్‌గా ఎస్సీ జనరల్ కేటగిరీలో గెలుపొందిన హరి అనే వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించారన్నారు. రోజులు గడిచే కొద్ది పదవి కోసం మంత్రి ఇంటిచుట్టూ తిరుగుతూనే ఉన్నా పట్టించుకోకపోవడం, ఫోన్ సమాచారం పంపిన స్పందించకపోవడంతో తనకు న్యాయం చేయాలని మీడియా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి తనకు జరిగిన అన్యాయంపై ప్రత్యేకచొరవ తీసుకొని తన సొమ్ము తనకు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భువనేశ్వరి భర్త సుబ్రహ్మణ్యం, చరణ్, రఘువరన్, ప్రకాష్ పాల్గొన్నారు.

'కళ'లతో మెరిసి..

పురస్కారాలతో పులకించి





నంది, జాతీయ సేవా రత్న పురస్కారాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు





ప్రజాశక్తి-పుంగనూరు:
జాతీయ స్థాయి నంది, సేవా రత్న పురస్కారాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం రేణిగుంటకు చెందిన ఎంఏ జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక, ధార్మిక, కళారంగ సేవకులు, ప్రోత్సాహకులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, హసీనాభాను దంపతులు జాతీయ సేవా రత్న పురస్కారానికి, పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారుడు ఖాదర్ బాషా షేక్, లైట్ మ్యూజిక్, జానపద గాయని, మోటివేటర్ గండికోట ప్రమీల, శ్రీ నటరాజ కూచిపూడి కళామందిరం నిర్వాహకురాలు, ప్రముఖ నృత్య కళాకారిణి హరితా నగేష్, జర్నలిజం, మాస్ కమ్యూనికేటర్, ఫైన్ ఆర్ట్స్ కమ్యూనికేటర్ డాక్టర్ తుంగ యోగేష్ బాబు, పుంగనూరుకు చెందిన ప్రముఖ గాయని, రచయిత్రి, యాంకర్ ఎస్.శ్రవంతి, ఉపాధ్యాయుని, రచయిత్రి కె.గాయత్రి దేవి, గాయకులు ఎం.నారాయణస్వామి నంది పురస్కారాలకు ఎంపికైనట్లు పురస్కార ప్రధానోత్సవ నిర్వాహకురాలు, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.సరోజనమ్మ నుంచి సమాచారం అందుకున్నారు. ఈ నెల 27న హైదరాబాదు రవీంద్ర భారతిలో జరిగే అభిలాష హెల్పింగ్ యాడ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా వీరు జాతీయ సేవారత్న, నంది పురస్కారాలు అందుకోనున్నారు.











లెప్రసీ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-సదుం: లెప్రసీ వ్యాధి నిర్ధారణ పరీక్షలలో సదుం మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో 60 మంది అనుమానిత కేసులను పరీక్షలను నిర్వహించగా ఇందులో 4కేసులను గుర్తించినట్లు చెరుకువారిపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీషా మంగళవారం విలేకరులకు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6నెలల పాటు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పారా మెడికల్ ఆఫీసర్ దేవదాసు, హెల్త్ ఎక్స్టెన్సన్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్, హెల్త్ సూపర్ వైజర్ నీలకంఠ, సిహెచ్ఓ మనీషా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని కడపల్లి పంచాయితీ పోడూరు గ్రామంలో గోవిందమ్మ మంగళవారం మృతి చెందింది. ఎమ్మెల్సీ భరత్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి రూ.పది వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, శేఖర్, గోవిందన్, సంజీవ్, పాల్గొన్నారు.

నెల్లిమందలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద గ్రామంలో మంగళవారం వైద్యాధికారిణి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అవినాష్‌రెడ్డి, అన్నపూర్ణ, రహమత్ అలీఖాన్, కుమార వెంకటేశ్వర్లు, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ


ట్యాబ్‌లు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థులకు మంగళవారం బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ మోహన్‌రాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. హెచ్‌ఎం టీవీ రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు సాంకేతిక ఎదుగుదలను సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాస్ మహిళా పొదుపు సంఘా సభ్యుల సౌకర్యార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డీఎం పురం సర్పంచ్ తులసి అన్నారు. మంగళవారం రాస్ ఆధ్వర్యంలో డీఎం పురం ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన వైద్యశిబిరంలో టాటా ట్రస్టు ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ, షుగరు, హైపటైటీస్, నోరు, రొమ్ము, గర్భసంచి వంటి ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆచే విధంగా క్యాన్సర్పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న రాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధనశేఖర్ యాదవ్, టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి, అర్చన, వినత, రాస్ కోఆర్డినేటర్ హేమంత్, సిబ్బంది ప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-శాంతిపురం: నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన యువకులు మంగళవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వైస్ ఎంపీపీ పట్టాభి, ఏఎస్ హేమమాలిని పాల్గొన్నారు.

'విద్యార్థులు సాంకేతికంగా మెరుగుపడాలి'



ప్రజాశక్తి-నగరి: విద్యార్థులు సాంకేతికంగా మెరుగుపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిషనర్ డా.పోలా భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నగరి నోడల్ రిసోర్సెస్ సెంటర్ విభాగం తరపున నిర్వహించే మూడు రోజుల శిక్షణా శిబిరం ప్రారంభమైంది. యునెస్కో వారి 'విద్యార్థులలో స్వీయ నిర్దేశకత్వం, బావపూరిత శిక్షణ సానుభూతి, దయ' అనే అంశంపై నిర్వహించిన శిక్షణా శిబిరానికి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు అధికారికంగా హాజరయ్యారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిషనర్ డా.పోలా భాస్కర్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ అధ్యాపకులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి, సాంకేతికంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందుకోవడానికి, ఒత్తిడిని అధిగమించి మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి నిపుణులు శోభితా రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా విద్యాధ్యయనం చేయడానికి విలువలతో కూడిన విద్యను అందుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యాపక బృందానికి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలోని అధ్యాపకులు హాజరై నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. రోజుకు 40 మంది వంతున మూడు రోజులపాటు, నోడల్ రిసోర్స్ సెంటర్ అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 120 మంది అధ్యాపకులు శిక్షణా శిబిరానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.భాస్కర రాజు, నగరి రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డా.పంకజ, అధ్యాపకులు డా.మునెయ్య, డా.రమేష్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ


ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు గ్రామం శ్రీసాయి చరణ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను ఎంఈవో శివ రత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలన అనంతరం ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన విద్య అందే విధంగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ అంజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'వలంటీర్ తీరు సమంజసం కాదు'


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ పంచాయతీలో టీడీపీ చేపట్టిన 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఆదే సమయంలో కలగజేసుకున్న వలంటీర్ టీడీపీ కార్యకర్తపై బెదిరించడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం జీడీ నెల్లూరులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్ టీడీపీ కార్య కర్తను బెదిరించడం పట్ల వాళ్ల తీవ్రంగా ఖండించారు. వలం టీరు తీరు సమజసం కాదని పేర్కొన్నారు. నాయకులు శరవన్ కుమార్, దీపక్‌చౌదరి, సునీల్‌నాయుడు, సురేంద్రబాబురెడ్డి, లోకమ్మ, భువనేశ్వరి, గాయత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు.

'కులగణన'లో అధికారులు బిజీబిజీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం కులగణన సర్వే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇంటింటికీ వెళ్లి నిర్వహించారు. ఎంపీడీవో నాగరాజు ఇరికిపెంట గ్రామంలో పర్యవేక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం కులగణన కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి వారి పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని, ఇంటిలోని ప్రతి ఒక్కరికి కులగనన తప్పనిసరిగా చేయాలని వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌కుమార్, జయశంకర్, మేనక, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు డివిజన్ దాటితే వేటు తప్పదు: ఏడీ

ప్రజాశక్తి -బాలాయపల్లి : వ్యవసాయ పంటలకు సంబంధించిన ఎరువులు డివిజనల్ దాటి విక్రయం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని గూడూరు వ్యవసాయ శాఖ ఏడీ గోపీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న రసాయనిక ఎరువుల దుకాణా లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాలలో సంబంధించి రైతులకు మాత్రమే వ్యవసాయ ఎరువులను విక్రయించాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా విక్రయిస్తే లైసెన్సులను రద్దుచేసి క్రిమి నల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కొంత మంది ఎరువులు దుకాణ యాజ మాన్యం అధిక రేట్లకు అమ్మకాలు జరగకుండా చూడాలని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి శిరీష, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు నల్లటి. రాంబాబు నాయుడు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాకాల: అపరిష్కృత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల బిటిఎ నాయకులు మంగళవారం తహశీల్దారు భాగ్యలక్ష్మి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయుల దీర్ఘకాలికంగా పరిష్కారం ఉపాధ్యాయ సర్వీసు, ఆర్థిక, విద్య సంబంధిత సమస్యలు జనవరి 21 లోపు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి టి ఏ నాయకులు ఆంజనేయులు, రామ్మూర్తి, జయ బాల, విశ్వనాథం, పున్నాకు వెంకటయ్య, వెంకటయ్య, విజయమోహన్, జ్యోతి, రాజేంద్రుడు, గణేష్, శివ ప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీసిటీ సందర్శన

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: ఏపీ గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్యకు చెందిన 35 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఆ సంస్థ ఛైర్మన్ జి.ప్రకాశం యాదవ్ , మేనేజింగ్ డైరెక్టర్ టి దామోధర్ నాయుడు నేతృత్వంలో శ్రీసిటీని మంగళవారం సందర్శించారు. విభిన్న పరిశ్రమలకు నిలయమైన శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని నేరుగా వీక్షించి, పలు అభివృద్ధి అంశాలను తెలుసుకోవడం వీరి పర్యటన ముఖ్య ఉద్దేశం. శ్రీసిటీ జనరల్ మేనేజర్ (ప్రభుత్వ సంబంధాలు) వి.భగవాన్ ప్రతినిధుల బృందానికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ మౌలిక వసతులు, ప్రగతి ప్రత్యేకతల గురించి వివరించారు. అనంతరం వారు శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, ఇక్కడ వ్యాపారానుకూల వాతావరణాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. వివిధ రంగాలు, వివిధ దేశాలకు చెందిన అత్యుత్తమ తయారీ పరిశ్రమలను శ్రీసిటీకి తీసుకొచ్చి, భారీ ఉపాధి అవకాశాలను కల్పించడం పట్ల శ్రీసిటీ యాజమాన్య కృషిని వారు ప్రశంసించారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ కలెక్టర్, ప్రస్తుత సీఎంఓ సెక్రెటరీ భరత్ నారాయణ గుప్తా పుట్టినరోజు వేడుకలను మంగళవారం డాక్టర్ నైనారు పృథ్వి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబులి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక బ్రహ్మాశ్రమం వద్ద పేదలకు అన్నదానం చేశారు.

మంగళంలో వాల్ పోస్టర్ల రగడ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): మంగళం పంచాయతీలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఫోటోతో టిడిపి మేనిఫెస్టో కలిగిన వాల్‌పోస్టర్లను స్థానిక టిడిపి నాయకుల ఇళ్లకు అంటించుకున్నారు. ఈక్రమంలో ఎక్కడ గాని ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని స్థానిక పంచాయతీ సెక్రటరీ రాజేష్ పంచాయతీ సిబ్బందితో తొలగింపునకు ఆదేశాలు జారీచేశారు. పంచాయతీ సిబ్బంది తొలగింపునకు ఉపక్రమించడంతో టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పులివర్తి సుధారెడ్డి ఏ కారణం చేత గోడలకు అంటించిన వాల్‌పోస్టర్లను తొలగిస్తున్నారో చెప్పాలని మంగళం సచివాలయం భవనం ముందు టిడిపి శ్రేణులతో కలిసి బైఠాయించారు. వాల్‌పోస్టర్లు కూడా ఉండరాదని ఏదేని ఆర్డర్ ఉంటే ఇవ్వాలని అప్పుడే నిరసన విరమింప చేస్తామని చెప్పారు. దీంతో ఓ దశలో టిడిపి, వైసీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింప చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ నిబంధనలను లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

బీసీల అభ్యున్నతి జగనన్నకే సాధ్యం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- ఏర్పేడు : బీసీల సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యమని బీసీలు రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం ఆమందూరు బీసీ కాలనీకి చెందిన ఎం. వల్లెమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆయన మంగళవారం సిపాయి భరోసా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ఎమ్మెల్సీ స్థానం బీసీ అయిన తనకు ఇస్తే ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు టిడిపి గూటికి చేరారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, డాక్టర్ బాబు, లోకనాథం, రవి, చిన్న,అమ్ములు పాల్గొన్నారు.

వైన్ షాప్ వల్ల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి -ఏర్పేడు :

ఏర్పేడు మండలం సదాశివపురం నుండి రాజుల కండ్రిగ మధ్యలో ఉన్న వైన్ షాప్ రోడ్డు పక్కనే ఉండడం వల్ల మంగళవారం ఉదయం ఒక్కసారిగా మందుబాబులు కిక్కిరిసి పోవడంతో ఇటు ముసలిపేడు అటు పాపా నాయుడుపేట వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ స్తంభించడంతో ఇబ్బందిగా మారింది.

బీసీ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి -చిల్లకూరు:

చిల్లకూరు మండల పరిధిలోని తిక్కవరం గ్రామంలో బీసీ అసోసియేషన్ సమావేశం మేకల కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా మునిశేఖర్ వ్యవహరించారు. బీసీ నాయకులు మాట్లాడుతూ మహిళా సంఘం అధ్యక్షురాలు లీలావతి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సునీల్‌కు ఓట్లేసి గెలిపించాలని కోరారు. విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ లో పనిచేస్తూ కాలేజీలో యూనియన్ సెక్రెటరీగా గెలిచి విద్యార్థులకు సేవలు అందించి తర్వాత గూడూరు మున్సిపాలిటీకి చైర్మన్‌గా గెలిచి గూడూరు పట్టణ ప్రజలకు సేవలు అందించారని, అటువంటి నాయకుడిని గెలిపించుకోవాల్సిన అవసరం వుందన్నారు. నాయకులు ఎస్వి రమణారెడ్డి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చిల్లకూరు మండల నాయకులు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సొంత గూటికి జంగాలపల్లి హరికృష్ణ నాయుడు

ప్రజాశక్తి-పాకాల:

మండలంలోని మగరాల జంగాలపల్లికి చెందిన హరికృష్ణ నాయుడు ఇటీవల టిడిపి నుంచి వైసిపిలో చేరారు. హరికృష్ణ నాయుడు 24 గంటలు గడవకముందే మంగళవారం చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి సమక్షంలో మళ్లీ సొంత పార్టీ టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా హరికృష్ణ నాయుడు మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద నాయుడు, ఈశ్వర్ చౌదరి, డేవిడ్ సురేష్, గిరి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు


చిత్తూరులో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు పురస్కరించుకొని చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం శ్రేణులు, జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిజేఎమ్ ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ కేక్ కట్ చేసి నారా లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిజేఎం కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు యువ నాయకులు, జిజేఎమ్ యువత రక్త దానం చేశారు. ముఖ్య కార్యకర్తలకు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. పిసిఆర్ సర్కుల్లో అన్నదానం, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగాలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, గురజాల చెన్నకేశవ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, కాజూరు బాలాజీలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు, కార్వేటినగరం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 41వ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా గంగాధర నెల్లూరు బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అదే విధంగా కార్వేటినగరం వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు రవిప్రకాష్, స్వామిదాస్, క్రిష్ణమనాయుడు, చెంగ్రాయల్ యాదవ్, రాజేంద్ర రెడ్డి, నాగేశ్వరరాజు, శ్రీధర్‌యాదవ్, దేవసుందరం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ సారథ్యంలో వేడుకగా నిర్వహించారు. యాదమరిలో వినాయకుడు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ కేకును కట్ చేసిన లోకేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మన శ్రీధర్, మురాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా సర్పంచ్ కోక ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు హేమచంద్ర నాయుడు, వాసుదేవ నాయుడు, రమణ, గిరిబాబు, సూరి, రాధాకృష్ణన్, రవి పాల్గొన్నారు.

రామకుప్పం: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు కార్యకర్తలు రామకుప్పం మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం బందార్లపల్లి క్రాస్ వద్ద పెద్ద ఎత్తున కేక్ కత్తిరించి ఒకరికొకరు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, చలపతి, నారాయణ చారి, రామ్మూర్తి, సుబ్రీ,నందా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గంగాధర నెల్లూరు: కేక్ కట్ చేస్తున్న డాక్టర్ థామస్


యాదమరి: కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మురళిమోహన్

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శన

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఔ

రామచంద్రాపురం మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖం ఆధ్వర్యంలో రాజస్థాన్,మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, గుజరాత్ ఛత్తీస్‌ఘడ్, ఉత్తర ప్రదేశ్ నుండి ఎన్సిఎన్ఎఫ్ సెక్రటేరియట్ టీమ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిం చింది. మంగళవారం మండలంలో కుప్పంబాదురు యూనిట్ రాయల చెరువు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పలు రాష్ట్రాల నేచురల్ ఫామింగ్ ప్రతినిధులు 11 మంది సందర్శిం చి, విధివిధానాలను డిపిఎంని టీం సభ్యులు అడిగి తెలుసు కున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించే ఏటీఎం, ఏ గ్రేడ్, పిఎండిఎస్ పద్ధతులపై మండల ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం పట్టాభి రెడ్డి, మండల టీం లీడర్ విమల, ఎంటి రాగమ్మ, యూనిట్ ఇన్చార్జులు, ఫార్మా సైంటిస్టులు, ఐ సి ఆర్ పి లు రైతులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని పార్లపల్లి గ్రామ సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారని ఎస్ఐ నరసింహంకు అందిన సమాచారంతో తమ సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి రెండు కోళ్లు, 1500 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇకపై మండలంలో కోడిపందేలు ఆడినట్లు తెలిసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రంగా శరత్, నరేష్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మాక్‌పోల్


వికోట: అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్


ప్రజాశక్తి-వికోట:

ఓటు ప్రతి పౌరుడి హక్కు అని తహశీల్దార్ చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు ఏవిధంగా వెయ్యాలో మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఎంఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే ఓటింగ్ ప్రక్రియపై అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటింగ్ ప్రక్రియపై మాక్ పోల్ ద్వారా అవగాహన కల్పించారు. అదే విధంగా బాలికల ఉన్నత పాఠశాల, డీఎం పురం ఉన్నత పాఠశాల, లక్ష్మినరసింహా కళాశాలల్లో మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుబ్బారావు హరిబాబు, రాజశేఖర్, కార్తీక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే పోలింగ్ ఆఫీసర్లుగా, ఏపీవో, ఓపీవోలుగా విధులు ఎలా నిర్వహించాలో ఓటర్లు ఎలా ఓటు హక్కు వినియోగించుకోవాలో విద్యార్థులచే చూపించారు.

యాదమరి: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కాశీరాళ్ల హెచ్‌ఎం లలిత, యాదమరి పాఠశాల హెచ్‌ఎం గిరిరాజా, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఉదయబాబు, తులసిప్రసాద్ తదితరులు మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని తహశీల్దార్ బి.హనుమంతు, ఎంఈవో రుక్మిణి, ప్రసాద్‌లు సందర్శించారు.


కార్వేటినగరం: కళాశాలలో చేపడుతున్న మాక్ పోలింగ్

సదుం: ఓటు వేసే విధానం పైన, ఓటు హక్కుపై మంగళవారం సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ వర ప్రసాద్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించుటకు మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, జయకుమార్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, అమరనాధ్, యుగంధర్, శ్రీనివాసులు, వేణుగోపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మాక్ పోలింగ్ పై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్టు సెక్టోరల్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని తుంబు కుప్పం ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై అవగాహన విధులు చేపట్టే దానిపై మాక్ పోలింగ్ కార్యక్రమం విద్యార్థుల చేత నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని ఎన్నికల కేంద్రాలను పరిశీలించి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను చేసే విధంగా బిఎల్‌వోలకి సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు లలిత, రమేష్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని పలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేత మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. మంగళవారం విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులే పిఓ, ఏపీవో, ఓపిఓలు గాను పోలింగ్ ఏజెంట్స్ గాను, పోలీస్ సిబ్బంది గాను వ్యవహరించారు. ఎంఈవో ఆంజనేయులుశెట్టి, నెల్లెపల్లి హైస్కూల్‌ను సందర్శించి మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. టీచర్లు, విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. 145 మంది విద్యార్థులు పోలింగ్ ప్రక్రియలో పాల్గొని తమ ఓటును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం. సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.


సోమల: మాక్ పోలింగ్ విధుల్లో విద్యార్థులు